

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 512.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.



అలరించిన వేణుగాన కచేరీ

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం వల్లూరు కృష్ణకిషోర్, ఆర్.శశాంక్, జనార్దన్‌ల వేణుగాన కచేరీ అలరించింది.

నేడు వల్లభేశ్వరుడి వార్షికోత్సవం



రొంపిచర్ల: మండలంలోని విప్పర్లలో గల వల్లభేశ్వరస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ఉదయం నుంచి విశేష పూజలు, హోమాలు జరుగుతాయి.

న్యూస్‌రీల్

మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి హానికరం



గుంటూరు వెస్ట్ : మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తులకే కాదు దేశానికి కూడా తీవ్ర హానికరమని ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేక ర్యాలీని ప్రారంభించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాషా ముక్త్ భారత్ అభియాన్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. న్నారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈ 26 రోజుల పాటు ర్యాలీలు, సభలు, సమావేశాలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం 2020 నుంచి నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. ప్రజలకు ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించడమే దీని ధ్యేయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని నిరంతరం గమనిస్తుండాలని సూచించారు. అనంతరం జరిగిన ర్యాలీలో ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్‌తో పాటు, ఎస్పీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ సువార్త, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన హనుమత్ జయంత్యుత్సవాలు



తెనాలి: షరాఫ్‌బజార్‌లోని శ్రీసువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక శ్రీహనుమత్ జయంతి, 17వ లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణ మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. మే 22వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలను ఆదివారం ఉదయం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగించారు. తొలుత లక్ష హనుమాన్ చాలీసా పారాయణ పత్రికలకు ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస ఆగమ పండితుడు నాగ మారుతి బృందం విశేష పూజలు నిర్వహించింది. సాయంత్రం ఊంజల సేవ, పండిత ఆశీర్వచనం జరిగాయి. ఉత్సవాల పూర్ణాహుతి సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో సుమారు 1500 మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11 రోజుల పాటు జరిగిన ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అర్చకులు కిరణ్‌కుమార్, సురేష్, గ్రూప్-2 దేవాలయాల కార్యనిర్వహణాధికారి హరిప్రసాద్, కౌన్సిలర్లు పి.త్రిమూర్తి, దేసు యుగంధర్, గొడవర్తి సాయిహరేరామ్, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, బచ్చు లీలా ప్రసాద్ రావు, మాజేటి వెంకటేష్, సంకా శివ ప్రసాద్, మద్దు హరీష్ వెంకట మణిసాయి, బిట్రా రఘు, గోలి సోమశేఖర్, వెచ్చా కిషోర్, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.

వీలున్నప్పుడే రేషన్ సరుకులు తీసుకోండి

– ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ



గుంటూరు వెస్ట్ : వీలున్న సమయంలోనే రేషన్ సరుకులు తీసుకోవచ్చని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. ఆదివారం స్థానిక వసంతరాయపురంలోని షాప్ నెంబర్ 61లో సరకుల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెల 1– 15వ తేదీ వరకు ఉదయం 8 – 12, సాయంత్రం 4– 8 గంటల మధ్య సరుకులు పంపిణీ చేస్తారన్నారు. లబ్ధిదారులు వీలున్న సమయంలోనే దుకాణానికి రావచ్చన్నారు. ఈ–పోస్ మిషన్లు, వేయింగ్ మిషన్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. దుకాణదారులు ఇబ్బందులకు గురిచేస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. రేషన్ పంపిణీ విధానాన్ని కూడా ఆయన పరిశీలించారు. కార్డుదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్‌ఓ చంద్రముని, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కూటమి పాలన సంక్షోభం వైపు వెళ్తోంది. గత ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలందరికీ కులమతాలకు అతీతంగా అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు నిరాటంకంగా అందాయి. తర్వాత మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి.. సంక్షేమం మాటే మరిచిపోయింది. పింఛను నామమాత్రంగా పెంచి, ఉన్న లబ్ధిదారుల సంఖ్యను భారీగా తగ్గించడం మినహా ఒక్క పథకాన్నీ అమలు చేయలేదు. సరికదా.. ఇప్పటికే ఉన్న అన్ని పథకాలకూ తిలోదకాలు ఇచ్చింది. ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు, సామాన్యులపై దౌర్జన్యాలు చేయడంపైనే పాలకులు దృష్టి పెట్టారు. ప్రజా సంక్షేమం గాలికొదిలేశారు.

పాలనకు ఏడాదైనా..

సంక్షేమం సున్నా!

- వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు
- విద్యార్థుల చదువులకు ఇబ్బంది ఉండేది కాదు
- ఇళ్లు లేని పేద ప్రజలకు స్థలాలు ఇచ్చి, కట్టించిన వైనం
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఒక్కటీ అమలు కాని సంక్షేమ పథకాలు
- అసలు ఆ ఊసే వినిపించకపోవడంతో బాబు పాలనపై అన్ని వర్గాలు ఆగ్రహం
- ప్రకటనలకే పరిమితమవుతున్న కూటమి పాలకులు
- మోసపు మాటలతో అధికారంలోకి వచ్చి అదే బూటకపు ముచ్చట్లు
- నమ్మించి నట్టేట ముంచిన పాలకులు
- ఉన్న సంక్షేమ పథకాలు కూడా కోల్పోయిన ఆవేదనలో ప్రజలు

కూటమి ఏడాది పాలనలో అన్నివర్గాలకు తీరని అన్యాయం



సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, గుంటూరు, నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమం మాటలకే పరిమితం అయింది. దీంతో ప్రజలకు ఆర్థికంగా చేయూత లేకపోవడంతో కొనుగోలు శక్తి క్షీణించింది. మార్కెట్‌లో వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాజధాని పేరుతో చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం మినహా మిగతావి ముందుకు సాగడం లేదు. దీంతో ఏడాది కూడా గడవకముందే కూటమి పాలనపై ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది.

పింఛన్ల తనిఖీ పేరుతో రద్దు

సంక్షేమంపై ఏ మాత్రం దృష్టి పెట్టని చంద్రబాబు ప్రభుత్వం పేదల నోటి దగ్గర కూడు కూడా లాక్కొనేందుకు సన్నద్ధం అవుతోంది. పండుటాకులపై తన ప్రతాపం చూపిస్తోంది. దీనిలో భాగంగా పింఛన్ల తనిఖీ పేరుతో ఉన్న వాటినీ తొలగిస్తోంది. ఇప్పటి వరకు 6,798 మందికి వివిధ సాకులతో పింఛను రద్దు చేశారు. తాజాగా పైలెట్ వెరిఫికేషన్ పేరుతో ప్రతి జిల్లాలో ఒక సచివాలయం పరిధిలో తనిఖీ చేశారు. పింఛన్‌దారుల పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ మరోసారి వారి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ వివరాలు సేకరించారు. వీటిలో తేడాలు ఉన్నాయంటూ రద్దు ఆదేశాలు ఇచ్చారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా ఆ నిర్ణయాన్ని వాయిదా వేశారు.

అమలుకాని హామీలు

ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు జిల్లాలో పర్యటించి పలు హామీలు ఇచ్చారు. వాటిలో కనీసం ఒక్కటి కూడా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు.

ఏడాదైనా ఇంకా అదే తీరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను అమలు చేయలేదు. ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామన్నారు. దాని ఊసే లేదు. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, ఏటా రైతుకు రూ.20,000 ఆర్థిక సాయం ఇస్తామని చెప్పినా ఏడాది గడిచినప్పటికీ వాటి ప్రస్తావనే లేదు. ఇప్పటికీ ప్రజలకు మాటలతో కూటమి ప్రభుత్వం మోసగిస్తూనే ఉంది.

ముస్లింలకు మొండిచేయి

'ముస్లింలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తాం. ముఖ్య పట్టణాల్లో ఈద్గాలకు, ఖబరస్తాన్‌లకు స్థలాలు కేటాయిస్తాం. హజ్ యాత్రకు రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తాం. నూర్‌బాషా కార్పొరేషన్ పెట్టి ఏడాదికి రూ.వంద కోట్లు ఆర్థిక సాయం చేస్తాం. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇచ్చే బాధ్యత నాది' అంటూ గతంలో గుంటూరు పర్యటనలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. పైగా ఉన్న వక్ఫ్ భూములను బయట వ్యక్తులకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం తెగించింది. గుంటూరులోనే ఐటీ టవర్లు కట్టి వర్క్ ఫ్రం హోం విధానం తీసుకొస్తామని చెప్పారు. ఎన్నికల తర్వాత ఆ ఊసు మర్చిపోయారు.

అన్నీ మాటలకే పరిమితం

తల్లికి వందనంగా ఏటా రూ.15,000 ఇస్తాం. నిరుద్యోగులకు భృతిగా నెలకు రూ.3000 చొప్పున ఇస్తాం. ఏటా అన్నదాతలకు రూ.20,000 వేలు ఇచ్చి ఆదుకుంటాం. ఆడబిడ్డకు నిధిగా ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తాం.. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అంటూ ఊరించినా ఒక్కటి కూడా అమలు చేయలేదు. గుంటూరులో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేస్తానని చెప్పారు. ఇప్పటివరకూ దీనిపై చంద్రబాబు సమీక్షించిన పాపాన పోలేదు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో కూడా దీనిపై నిర్ణయం తీసుకోలేదు. గుంటూరు అమరావతి రాజధానిలో భాగం. 'హైదరాబాద్, సికింద్రాబాద్‌లకు తోడుగా సైబరాబాద్ నిర్మించి ఒక మహానగరానికి శ్రీకారం చుట్టాను. హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు కేవలం 163 కి.మీ మాత్రమే... కానీ, అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 180 కి.మీ.తో ఏర్పాటు చేస్తానని' చంద్రబాబు చెప్పారు. ఈ ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతోంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లాలో సంక్షేమ పథకాల కింద అందించిన మొత్తం వివరాలు..

క్రసం.	పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం(రూ.కోట్లలో)
1.	వైఎస్సార్ ఆసరా	2,90,994	808.60
2.	జగనన్న అమ్మ ఒడి	2,01,590	657.39
3.	జగనన్న అమ్మ ఒడి (అదర్స్)	1,87,574	47.32
4.	అర్చకుల గౌరవ వేతనం	1,051	0.53
5.	జగనన్న చేదోడు	11,397	32.59
6.	వైఎస్సార్ ఉచిత పంటల బీమా	57,207	74.47
7.	వైఎస్సార్ ఈబీసీ నేస్తం	25,401	67.72
8.	నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు	45,615	543.66
9.	ఇమామ్‌లు, మౌజన్‌లకు వేతనం	120	0.06
10.	వైఎస్సార్ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	65,758	78.10
11.	జగనన్న తోడు (వడ్డీ)	33,485	1.47
12.	జగనన్న తోడు (రుణాలు)	68,163	108.32
13.	జగనన్న వసతి దీవెన	1,05,471	115.86
14.	జగనన్న విద్యా దీవెన	1,15,392	364.94
15.	వైఎస్సార్ కల్యాణమస్తు	1,297	11.65
16.	వైఎస్సార్ కాపు నేస్తం	21,502	97.71
17.	వైఎస్సార్ లా నేస్తం	243	3.04
18.	వైఎస్సార్ మత్స్యకార భరోసా	269	0.58
19.	వైఎస్సార్ నేతన్న నేస్తం	940	7.30
20.	పాస్టర్ల గౌరవ వేతనం	1,823	0.91
21.	వైఎస్సార్ రైతు భరోసా	1,77,545	885.97
22.	వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణం	48,397	13.61
23.	వైఎస్సార్ సున్నావడ్డీ (ఎస్‌హెచ్‌జీఎస్)	3,77,515	100.73
24.	వైఎస్సార్ వాహన మిత్ర	17,574	61.16
25.	వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	54,315	42.26
26.	వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	86,931	394.80
27.	వైఎస్సార్ బీమా	5,324	79.33
28.	వైఎస్సార్ చేయూత	1,14,844	503.93
29.	వైఎస్సార్ పెన్షన్ కానుక	2,96,952	2847.82
30.	జగనన్న విదేశీ విద్యా దీవెన	42	3.68
31.	జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం	4	0.04
	మొత్తం	24,14,735	7,955.54

రూ.7,955.54 కోట్ల మేరకు లబ్ధి

వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లాలో సంక్షేమ పథకాలకు మొత్తం రూ.7,955.54 కోట్లు ఖర్చు చేశారు. జిల్లాలో 2019–24 కాలంలో 24,14,735 లక్షల మందికి రూ.7,955.54 కోట్ల మేరకు లబ్ధి చేకూరింది. ఇందులో అత్యధికంగా వైఎస్సార్ ఆసరా కింద 2,90,994 మందికి రూ.808.60 కోట్లు, వైఎస్సార్ రైతు భరోసా కింద 1,77,545 మందికి రూ.885.97 కోట్లు, జగనన్న అమ్మ ఒడి ద్వారా 2,01,590 మంది లబ్ధిదారులకు రూ.657.30 కోట్లు, పేదలందరికీ ఇళ్ల కార్యక్రమం ద్వారా 45,615 మందికి రూ.543.66 కోట్లు లబ్ధి చేకూరింది.

అధికారం కోసం అబద్ధాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు ఎన్నో పొందాం. కూటమి సర్కారు ఏర్పడితే ఏవేవో ఇస్తామని హామీలు ఇచ్చారు. కానీ ఒక్కటీ అమలు చేయకపోవడం బాధాకరం. కేవలం అధికారం కోసమే అబద్ధపు మాటలు చెప్పారు. ఏడాదైనా సంక్షేమ పథకాల ఊసే లేదు.

– లలితమ్మ, గుంటూరు

కార్యాలయాల వద్ద పడిగాపులు

గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే అన్ని సేవలు అందేవి. కూటమి అధికారంలోకి వచ్చాక అన్నీ ఆగిపోయాయి. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. గంటల తరబడి పడిగాపులు తప్పడం లేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి.

– స్వాతి, గుంటూరు

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయాలి

- 4న పొన్నూరులో నిరసన కార్యక్రమం
- తరలిరావాలని పిలుపునిచ్చిన నేతలు



వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొన్నూరు: అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చకుండా మోసగించిన కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు జూన్ 4న నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, గుంటూరు పార్లమెంటు పరిశీలకుడు పోతిన మహేష్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, తాడికొండ, గుంటూరు తూర్పు, మంగళగిరి, ప్రత్తిపాడు నియోజకవర్గాల సమన్వయకర్తలు వనమా బాల వజ్రబాబు, షేక్ నూరి ఫాతిమా, దొంతిరెడ్డి వేమారెడ్డి, బలసాని కిరణ్‌కుమార్‌లతో కలిసి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సభకు పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. తొలుత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

హామీలు నెరవేర్చని చంద్రబాబు

అనంతరం అంబటి రాంబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ప్రజలు ఇప్పటికే చంద్రబాబుకు ఓటెందుకు వేశామా అనే ఆలోచనలో పడ్డారని అన్నారు. రాష్ట్రంలో ప్రజల అవసరాలు గుర్తెరిగి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి డీబీటీ రూపంలో నేరుగా ప్రజల ఖాతాల్లో నగదు జమ చేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. చంద్రబాబు అంటే మోసం, దగా, వెన్నుపోటు, అబద్ధాలే గుర్తుకు వస్తాయన్నారు. ఎన్నికల ముందు చదువుకునే ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఒక్క హామీ అరకొరగా ఇచ్చి అన్నీ ఇచ్చినట్లు ప్రచారం చేయడంలో దిట్ట చంద్రబాబని విమర్శించారు. పైగా వలంటీర్లు, రేషన్ వాహనాల డ్రైవర్లు, సిబ్బంది ఉద్యోగాలను తొలగించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రతి ఒక్కరూ రాసుకుంటున్నారని, సరైన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చంద్రబాబు దుష్టపాలనకు నిరసనగా ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలతో పాటు పొన్నూరులో కూడా ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తామన్నారు. ర్యాలీలు చేపట్టి, అధికారులకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అన్నివర్గాలకు అన్యాయం

పార్టీ గుంటూరు పార్లమెంటు పరిశీలకుడు పోతిన మహేష్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదికే కూటమి ప్రభుత్వం ప్రజలతో ఛీ అనిపించుకుంటోందని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు అబద్ధపు హామీలిచ్చి మోసం చేశారని అన్నారు. సంక్షేమాన్ని అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో ఉన్న విద్యావ్యవస్థలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమూల మార్పులు తీసుకువచ్చి ఆ రంగాన్ని అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తే చెడిపోతారని చెప్పడం దుర్మార్గం అన్నారు. సంపద సృష్టిస్తా, పేదలను ధనవంతులుగా చేస్తా, అభివృద్ధిని అందలం ఎక్కిస్తానంటూ కాకమ్మ కబుర్లు చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక కరెంటు బిల్లులు విపరీతంగా పెంచారని దుయ్యబట్టారు. నవంబరు నుంచి పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యకర్తలకు లబ్ధితోపాటు అన్ని విధాలుగా అండగా ఉండే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. వ్యవస్థలో ఎలాంటి మార్పు తీసుకురావాలన్నా అది వైఎస్ జగన్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. ఆయనను మళ్లీ సీఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం వెన్నుపోటు దినం కరపత్రాలను ఆవిష్కరించారు. మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైఫుల్లా, ఎంపీపీ భవనం పద్మలీల, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్ రాణి, నియోజకవర్గ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, అంబటి వెంకటేశ్వరరావు, షేక్ నాజర్, బొనిగల వేణుప్రసాద్, చింతలపూడి మురళీకృష్ణ, ఎండేటి వెంకట సుబ్బయ్య, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ రేషన్ కష్టాలు

- తొలిరోజు సరుకుల పంపిణీలో తీవ్ర ఇబ్బందులు
- పలుచోట్ల ఈ–పోస్ మిషన్లు మొరాయింపుతో సమస్యలు
- ఎమ్మెల్యే మాధవి ప్రారంభించిన దుకాణంలోనూ పనిచేయని వైనం
- ఇంటి వద్దకే సరుకులు ఇచ్చే వ్యవస్థను నాశనం చేసిన కూటమి ప్రభుత్వం
- పాలకుల తీరుపై ప్రజల తీవ్ర ఆగ్రహం



గుంటూరు వెస్ట్: రేషన్ సరుకుల పంపిణీ తొలిరోజు దారుణంగా విఫలమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఎండీయూ వాహనాలను కాదని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ ప్రారంభించింది. దీని కోసం నాయకులతోపాటు కార్యకర్తలను దుకాణాలకు పంపి హడావుడి చేసింది. ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. చాలా చోట్ల ఈ –పోస్ మిషన్లు పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్లా మాధవి స్థానిక ఏటీ అగ్రహారంలో నెంబర్ 0781174 రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. కొద్ది సేపటికే అక్కడ ఈ –పోస్ మిషన్ మొరాయించింది. జిల్లాలో మొత్తం 972 రేషన్ దుకాణాలున్నాయి. 5,99,511 మందికి సుమారు 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంది. తొలి రోజు పెద్దగా స్పందన లేదు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేటప్పుడు పేదలకు ఎంతో సౌలభ్యంగా ఉండేది. ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నామని కార్డుదారులు వాపోతున్నారు.



ఉదయం 10.12 గంటలకే బయోమెట్రిక్ సర్వర్ ఆగిపోయిందని చూపుతున్న రేషన్ డీలర్ గాలీబ్

తప్పని సమస్యలు

చాలా దుకాణాల్లో సర్వర్ మొరాయించింది. కొన్ని చోట్ల నెమ్మదించింది. ఈ పోస్ మిషన్లు, వేయింగ్ మిషన్లు చాలా వరకు పాడైపోయాయి. కొన్ని చోట్ల లైన్లు కనబడగా, మరికొన్ని చోట్ల ఎవ్వరూ రాలేదు. మిషన్లు పనిచేయకపోవడంతో ప్రజలు తిరిగి వెళ్లిపోయారు.

చాలా ఇబ్బందిగా ఉంది



పనులు చేసుకునే మాకు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ విధానం చాలా బాగుంది. దానికి పూర్తిగా అలవాటు పడ్డాం. ఇప్పుడు రేషన్ దుకాణాలు మాకు దూరంగా ఉన్నాయి. వెళ్లి వరుసలో నిలబడి తీసుకోవడం ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం దీనిపై పునరాలోచించుకోవాలి

– కె.మిర్యామ్

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో ఆదివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,100 గరిష్ఠం : రూ. 3,400

మోడల్ ధర రూ. 2,600

క్లుప్తంగా

విలువలతో కూడిన విద్యావిధానం అభినందనీయం

హైకోర్టు జడ్జి జస్టిస్ చీమలపాటి రవి



గుంటూరు ఎడ్యుకేషన్: విలువలతో కూడిన విద్యా విధానం అభినందనీయమని హైకోర్టు జడ్జి జస్టిస్ చీమలపాటి రవి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం గుంటూరులోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన జస్టిస్ చీమలపాటి రవి లక్ష్మీపురం మెయిన్ రోడ్‌లోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ హైస్కూల్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పాటిబండ్ల సీతారామయ్య ఆశయాలకు అనుగుణంగా నేటి సమాజానికి మంచి విలువలు అందేలా తమదైన శైలిలో విద్యాబోధనతో పాఠశాలను నడపడం అభిందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలు

నగరంపాలెం: జిల్లాలో పోలీస్ కానిస్టేబుళ్ల పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాలను నెలకొల్పారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోనికి అనుమతించారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష కొనసాగింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ గుంటూరు నగరంలోని విజ్ఞాన్ నిరులా, ఏసీ కళాశాల తదితర పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

నాదెండ్ల: జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొని ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. తిమ్మాపురం గ్రామ పరిధిలోని తిరుమల స్పిన్నింగ్ మిల్లులో పనిచేసే ప్రీతమ్‌మాలిక్ (24) తన సోదరుడు శ్రీతమ్‌మాలిక్ కుటుంబంతో కలిసి స్థానిక స్పిన్నింగ్ మిల్లు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. రెండేళ్లుగా క్వార్టర్స్‌లో ఉంటూ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. రెండు నెలల కిందట ప్రీతమ్‌మాలిక్ ఒడిశా నుంచి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. శనివారం రాత్రి మిత్రుడు లిట్టూతో కలిసి ప్రీతమ్‌మాలిక్ బైక్‌పై చిలకలూరిపేట వెళ్లి తిరిగి వస్తున్నాడు. ప్రసన్నవంశీ స్పిన్నింగ్‌మిల్లు వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రీతమ్‌మాలిక్ అక్కడికక్కడే మృతిచెందాడు.

వెన్నుపోటు దినం విజయవంతం చేద్దాం

- చంద్రబాబు, లోకేష్‌ల కళ్లు తెరిపించేలా నియోజకవర్గంలో కార్యక్రమం నిర్వహిస్తాం
- వాల్ పోస్టర్ల ఆవిష్కరణలో వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త వేమారెడ్డి, ఎమ్మెల్సీ హనుమంతరావు



వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: ఈ నెల 4వ తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినంలో నియోజకవర్గంలోని ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పిలుపునిచ్చారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట కల పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. వేమారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అనేక మోసపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏడాది పాలనలో ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. నియోజకవర్గంలో నివాసముంటున్న చంద్రబాబు, లోకేష్‌ల కళ్లు తెరిపించేలా వెన్నుపోటు దినాన్ని ప్రజలు విజయవంతం చేయాలన్నారు. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం చరిత్రలో ఎన్నడూ జరగలేదని, చంద్రబాబుకు ఆ ఘనత దక్కిందన్నారు.

చంద్రబాబు, లోకేష్‌ల కళ్లు తెరిపించాలి..

ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న వెన్నుపోటు దినంలో ప్రజలంతా ఐక్యంగా పాల్గొనాలన్నారు. ప్రజలకు చేసిన మోసాన్ని చంద్రబాబుకు తెలిసేలా వెన్ను పోటు దినంను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను సూపర్ సిక్స్ పేరుతో మోసం చేసిన చంద్రబాబును ప్రజలు నిలదీయాలన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఇచ్చిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపేసిన చంద్రబాబు తన పాలనలో ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని, ప్రజలంతా వెన్నుపోటు దినంలో పాల్గొని చంద్రబాబు, లోకేషలు కళ్లు తెరిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మంగళగిరి, తాడేపల్లి పట్టణ, మండల, దుగ్గిరాల అధ్యక్షులు నాలి వెంకట కృష్ణ, బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, అమరా నాగయ్య, తాడిబోయిన శివగోపయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, సీనియర్ నాయకుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, అనుబంధ సంఘాల అధ్యక్షులు కట్టెపోగు భూషణం, బందాపు రుక్మాంగ రెడ్డి, యర్రకోటి మల్లిఖార్జునరెడ్డి, రత్నాకరం శ్రీనివాసరాజు,సయ్యద్ గౌస్ మొహిద్దీన్, ఈపూరి ఆదామ్, తిరుమల శెట్టి సురేంద్ర,కలకోటి సునీల్‌కుమార్, షేక్ జానీ బాషా, చిలువూరి ఫిలోమినా, జంగా నాగిరెడ్డి, భీమిరెడ్డి శ్రవణ్ కుమార్ రెడ్డి, మాదాల గోపీ కృష్ణ, నందిగం ఆకాష్, లేళ్ళ సురేష్, షేక్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు రూరల్: ఎన్నికల హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఏటుకూరు బైపాస్‌రోడ్డులోని నియోజకవర్గం కార్యాలయంలో ఈనెల 4వ తేదీన కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి, నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను బలసాని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి నట్టేట ముంచి వారి ఓట్లతో గద్దెనెక్కి నేడు ఆ ప్రజలను మరిచిందన్నారు. హామీలు అమలు చేయకపోగా విద్యుత్ చార్జీలు పెంచారని, నిత్యావసర ధరలు పెంచారని, ప్రజలకు సంక్షేమాన్ని అందించకపోగా అరాచకాన్ని చూపుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. ఈనెల 4వ తేదీన జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రతి కార్యకర్త, నాయకుడు, ప్రజా ప్రతినిధి ప్రతి ఒక్కరూ పాల్గొని కూటమి ప్రభుత్వపై నిరసన తెలిపి ప్రజా సమస్యలను తెలియజేయాలని కోరారు. 4వ తేదీన జరిగే కార్యక్రమంలో సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వ పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి సత్కారం

నగరంపాలెం: ఉద్యోగ విరమణ పొంది ప్రతిఒక్కరూ తమ భావి జీవితాన్ని సుఖసంతోషాలతో జీవించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఎస్‌ఐలు రంగారావు (అరండల్‌పేట పీఎస్) పి.నాగేశ్వరరావు (చేబ్రోలు పీఎస్), బి.వెంకటేశ్వరరావు (ఏఆర్), ఏఎస్‌ఐ ఎంవీ.కృష్ణారావు (పట్టాభిపురం పీఎస్), హెడ్ కానిస్టేబుల్ సీహెచ్.కృష్ణారావు (పట్టాభిపురం పీఎస్), జి.నాగేశ్వరరావు (తాడికొండ పీఎస్),షేక్ మహమ్మద్‌షరీఫ్ (డీపీఓ సీనియర్ సహాయకుడు)లు ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో వారిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి గారు, ఎస్‌బీ సీఐ అళహరి శ్రీనివాస్, ఆర్‌ఐలు శివరామకృష్ణ, జిల్లా పోలీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మైలా సాంబశివరావు, కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి హుస్సేన్ పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన వారిని సత్కరిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

రాష్ట్రస్థాయి ఈత పోటీలు ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: ఈత అత్యుత్తమ వ్యాయామమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో 11వ సీనియర్ అంతర్ జిల్లాల స్విమింగ్ ఛాంపియన్‌షిప్– 2025 పోటీలను నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు పలు ప్రణాళికలు రూపొందించిందని వివరించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 105 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కె.రవికాంత్, అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, కార్యదర్శి మోహనవెంకటరామ్, కోశాధికారి రమేష్, పల్నాడుజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

చిన్నారులతో మైదానాలు కళకళలాడాలి

- ఎమ్మెల్యే నసీర్ అహ్మద్
- ముగిసిన అండర్–16 టెన్నిస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నారులతో క్రీడా మైదానాలు కళకళలాడాలని, ఆ విధంగా స్టేడియంను తీర్చి దిద్దుతామని తూర్పు శాసన సభ్యుడు మొహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. గత మూడు రోజుల నుంచి స్థానిక బీఆర్ స్టేడియంలో జరుగుతున్న అండర్–16 బాల బాలికల ఓపెన్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ రూ.100 కోట్లతో స్టేడియంను అభివృద్ధి చేస్తామన్నారు. పోటీల నిర్వహకుడు, టెన్నిస్ కోచ్ షేక్ అహ్మద్ మాట్లాడుతూ అండర్–16 బాలుర విజేతగా కె.విన్సెంట్ నిలవగా రన్నర్‌గా జయ సాయి కుమార్ నిలిచాడన్నారు. బాలికల్లో గోలి జోషిత విజేత కాగా తనిక్ష రెడ్డి రన్నర్‌గా నిలిచిందని చెప్పారు. విజేతలకు బహుమతులను నసీర్ అహ్మద్, టోర్నమెంట్ స్పాన్సర్ డాక్టర్ రామకృష్ణ, రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి, జీవీఎస్ ప్రసాద్, సుబ్బారావు, జాగర్లమూడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అండర్–16 టెన్నిస్ విజేత విన్సెంట్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

నిర్బంధ బదిలీల ఆదేశాలు ఉపసంహరించుకోవాలి

ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నిర్బంధ బదిలీ చేయాలని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డిని ఆర్జేడీ కార్యాలయంలో కలిసి ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. లాంగ్ స్టాండింగ్‌లో లేకున్నప్పటికీ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా వెళ్లాల్సిందేనని ఒత్తిడి తీసుకువచ్చి, నిర్బంధ బదిలీపై పంపాలనే నిర్ణయాన్ని ఎస్టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీసులో సీనియార్టీని పరిగణలోకి తీసుకుని, మెరిట్ జాబితా సిద్ధం చేయాల్సి ఉండగా, పుట్టిన తేదీ ఆధారంగా జాబితాలను తయారు చేయడం నిబంధలకు విరుద్ధమన్నారు. తక్షణమే వాటిని సరిచేసి మెరిట్ ప్రకారం జాబితాలు తయారు చేయాలని కోరారు. రీ అప్పోర్షన్‌కు గురైన ఉపాధ్యాయులకు ఓల్డ్ స్టేషన్ పాయింట్స్‌తో పాటు జత చేసిన రీ అప్పోర్షన్ పాయింట్లను తొలగించాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలను ఉపసంహరించుకోవాలన్నారు. ఆర్జేడీని కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుబ్బారెడ్డి, నాయకులు శ్యామ్, దిబ్బయ్య, బాజీ, వెంకట్రావు ఉన్నారు.

ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులు ఎస్జీటీలతో భర్తీ చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులను ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించడం ద్వారా భర్తీ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 219 మంది జూనియర్ స్కూల్ అసిస్టెంట్ టీచర్లను నిర్బంధంగా బదిలీ చేయడాన్ని ఆపాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకను ఆదివారం నగరంపాలెంలోని స్టాల్ గరల్స్ హైస్కూల్లో కలిసిన యూటీఎఫ్ జిల్లా ప్రతినిధులు ఆమెకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులలో స్కూల్ అసిస్టెంట్లకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. విద్యాశాఖ అధికారులు హడావుడి నిర్ణయాలు మానుకోవాలని తెలిపారు. డీఈఓను కలిసిన వారిలో జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎండీ షకీలా బేగం, కె.రంగారావు, బెల్లంకొండ ప్రసాదు, ఎం.కోటిరెడ్డి, సీనియర్ నాయకులు పి.హనుమంతరావు, చెన్నకేశవరావు, గఫ్ఫార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు



డీఈఓ రేణుకకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ బృందం

అండర్‌పాస్‌లో ఇరుక్కుపోయిన లారీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ కరకట్ట నుంచి సీతానగరం వచ్చే మార్గంలో బకింగ్‌హామ్ కెనాల్ వద్ద ఉన్న రైల్వే అండర్‌పాస్‌లో మరోసారి భారీ వాహనం ఆదివారం ఇరుక్కుపోయింది. సీతానగరం నుంచి ఎన్టీఆర్ కరకట్ట వైపు వెళుతున్న లారీ రైల్వేబ్రిడ్జి సేఫ్టీ కోసం ఏర్పాటు చేసిన గడ్డర్‌ను దాటి ముందుకు వచ్చేసింది. బ్రిడ్జి కిందకు రాగానే లారీపై ఉన్న లోడ్ బ్రిడ్జికి తగిలి ఇరుక్కుపోవడంలో లారీ డ్రైవర్ లారీని నిలిపివేశాడు. చివరకు టైర్లలో గాలి తీసి ఆ లారీని ముందుకు తీసుకువెళ్లారు. ఈ రైల్వే బ్రిడ్జి కింద తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతుండడంతో పెను ప్రమాదం జరిగే అవకాశముందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. రైల్వే అధికారులు స్పందించి రైల్వే బ్రిడ్జికి ప్రమాదం కలగకుండా బ్రిడ్జికి సమాంతరంగా గడ్డర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జరిగిన ఈ సంఘటనపై తెనాలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.



రైల్వేట్రాక్ కింద ఇరుక్కుపోయిన లారీ

తిరుపతమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ


పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలుపొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. –ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు.



శ్రీతిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

క్రీడాకారులను తీర్చిదిద్దడం గొప్ప విషయం

చినగంజాం: క్రీడాకారులను ప్రతిభావంతులుగా తీర్చి దిద్దడం గొప్ప విషయం అని హైదరాబాద్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అన్ను వేణుగోపాల్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో 40 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరానికి శిక్షకుడుగా అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు గిరిబాబు వ్యవహరించి ప్రతి రోజూ శిక్షణ అందించారని, అనేక మంది యువ క్రీడాకారులు ప్రేరణ పొందారన్నారు. ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుంచి జూన్ 1వ తేదీ వరకు గ్రామీణ యువతకు కబడ్డీపై శిక్షణ ఇచ్చే కార్యక్రమం నిర్వహించామని.. శిబిరం విజయవంతంగా ముగిసిందన్నారు. కోచ్ గిరిబాబు మాట్లాడుతూ శిబిరంలో మొత్తం 150 మంది బాలలకు శిక్షణ ఇచ్చామని, శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు డాక్టర్ నల్లూరి సుబ్బారావు రూ.లక్ష విరాళంగా అందజేశారని తెలిపారు. దీంతో క్రీడాకారులకు పౌష్టికాహారం, కబడ్డీ కిట్‌లు అందజేశామన్నారు. శిబిరంలో సీనియర్ క్రీడాకారులు బి.నాగాంజనేయులు, వెంకటేష్, కె.సతీష్‌రెడ్డి, బి.శివారెడ్డి, డి.సుబ్బారెడ్డి, వి. వెంకటేష్, జీటీ అంకిరెడ్డి, ఎం.భాను ప్రకాష్‌రెడ్డి తదిరులు పాల్గొనగా వారి సలహాలు సూచనల మేరకు శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి క్రీడాకారులకు భోజన వసతి కల్పించేందుకు అన్ను వేణుగోపాల్ రూ.40 వేలు ఆర్థిక సాయమందించినట్లు తెలిపారు. మచిలీపట్నం జిల్లా అదనపు పోలీస్ అధికారి సత్యం, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ దాత డాక్టర్ నల్లూరి సుబ్బారావు, అసోసియేషన్ చైర్మన్ చంద్రమోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

చెస్ టోర్నీ విజేతగా ధృవేష్

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రస్థాయి చదరంగం పోటీల విన్నర్ ట్రోఫిని గుంటూరుకు చెందిన డి.ధృవేష్ కైవసం చేసుకున్నాడు. విజయవాడ శివారు కానూరులోని స్కాట్స్‌పైన్ స్కూల్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి చెస్ ఓపెన్ టోర్నమెంట్ జరిగింది. చెస్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్, స్కాట్స్ పైన్ స్కూల్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించిన ఈ పోటీల్లో 178 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఏడు రౌండ్లపాటు సాగిన ఈ పోటీల్లో గుంటూరుకు చెందిన ధృవేష్ విన్నర్‌గా నిలువగా, విజయవాడకు చెందిన పి.జయసాకేత్ రన్నర్ ట్రోఫీని అందుకున్నాడు. విజేతలకు చెస్ సీనియర్ కోచ్‌లు డి.లక్ష్మణరావు, జె.మల్లేశ్వరరావు, స్కూల్ ఫిజికల్ డైరక్టర్ ఎస్.శివ ట్రోఫీలను అందజేశారు.



దుర్గమ్మ సన్నిధిలో భక్తుల తాకిడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

- మహానివేదన తర్వాత వీఐపీ దర్శనాలకు బ్రేక్..
- అంతరాలయ దర్శనం రద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవులు ముగియనుండటంతో, వివాహ ముహుర్తాల నేపథ్యంలో నూతన వధూవరులు, భక్తులు, యాత్రికులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి కనిపించగా, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేశారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు దేవస్థాన కేశకండనశాలలో తలనీలాలు సమర్పించారు. ఘాట్‌రోడ్డు, మహామండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. సర్వదర్శనంతో పాటు రూ. 100, రూ. 300, రూ. 500 టికెట్ల క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్వదర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండున్నర గంటలు, రూ.100, రూ.300 టికెట్‌పై దర్శనానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది.



దర్శనం కోసం క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

వీఐపీ దర్శనాలను బ్రేక్

ఉదయం 11–30 గంటల నుంచి మధ్యాహ్నం 1–30 గంట వరకు వీఐపీ దర్శనాలను దేవస్థాన అధికారులు నిలిపివేశారు. అమ్మవారికి మహానివేదన నిమిత్తం ఉదయం 11–45 గంటల నుంచి 12–15 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. మహానివేదన అనంతరం రూ. 500టికెట్ల విక్రయాలను నిలిపివేసి, రూ. 300 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు బంగారువాకిలి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 2గంటలవరకు ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీసేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఏడు గంటలనుంచి భక్తుల తాకిడి కనిపించింది.